క్లుప్తంగా

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి అన్నప్రసాదం భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో దాతలు కంభంపాటి అవినాష్, లక్ష్మీ ప్రత్యూష సహకారంతో 300 మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి కంభంపాటి విజయలక్ష్మి, రవితేజ పాల్గొన్నారు. కల్యాణ మండపంలో కొలువైవున్న పద్మావతి శ్రీనివాసులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

జ్యోతిర్ భాను చిరస్మరణీయులు

విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అవయవ దానం ద్వారా ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపిన శౌంతి జ్యోతిర్ భాను చిరస్మరణీయులని విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య అన్నారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య తన సిబ్బందితో కలిసి గవర్నర్‌పేటలోని జ్యోతిర్‌భాను నివాసానికి వెళ్లి శుక్రవారం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అవయవదానానికి గౌరవ సూచికంగా కుటుంబ సభ్యులను సత్కరించారు. జీవన్‌దాన్ ధ్రువీకరణపత్రాన్ని అందజేశారు. జీవన్‌దాన్ పథకం కింద రూ. 10 వేల అంత్యక్రియల సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఓ గొప్ప వ్యక్తిని కోల్పోయిన ఆ కుటుంబం విషాదంలోనూ అవయవదానానికి ముందుకురావడంతో ఎన్నో జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. ఈ కుటుంబ సభ్యులు అవయవదానం ప్రాధాన్యతను తెలియజేయడంతో పాటు ప్రజల్లో స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు.

సోనీ బ్రావియా నూతన మోడల్స్ ఆవిష్కరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జపనీస్ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సోనీ కంపెనీ 2025 నూతన మోడల్స్ మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి. విజయవాడ ఏలూరు రోడ్డు విజయటాకీస్ సెంటర్‌లోని సోనోవిజన్ షోరూంలో మేనేజింగ్ పార్టనర్ భాస్కరమూర్తి సోనీ ఇండియా ఏపీ స్టేట్ హెడ్ అయ్యప్పన్‌తో కలిసి శుక్రవారం నూతన మోడల్స్‌ను ఆవిష్కరించారు. వీటిలో బ్రావియా 5 టీవీ, బ్రావియా సిస్టమ్ 6 హోమ్ థియేటర్, బ్రావియా బార్ 6 సౌండ్‌బార్ మోడల్స్ ఉన్నాయి. కార్యక్రమంలో డెప్యూటీ మేనేజర్ భాస్కర్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: చంద్రశేఖర్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సినీ సంగీత దర్శకుడు కేవీ మహాదేవన్ జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ మహాదేవన్ సంగీతం వినసొంపుగా ఉంటుందని అనేక చిత్రాలు ఆయన స్వర పరచిన పాటల వల్లనే విజయవంత మయ్యాయన్నారు. తెలుగులో ఆయన దర్శకుడు విశ్వనాథ్‌తో కలిసి పలు మధురమైన పాటలను అందించినట్లు తెలిపారు. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సునీల్‌కుమార్, భారతి, రూపశ్రీ చిత్రగీతాలను ఆలపించారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీ విధానం గందరగోళం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాల్లో జరుగుతున్న బదిలీలకు లేని నియమ నిబంధనలు గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు మాత్రమే ఎలా వర్తిస్తాయని ఏపీ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల అర్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో పారదర్శకత లోపించిందని, దాంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. లక్షా ముప్పై వేల మంది సచివాలయ ఉద్యోగులకు ఉపాధ్యాయుల తరహాలోనే పారదర్శకమైన వెబ్ కౌన్సెలింగ్ విధానం ద్వారా బదిలీలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. సిఫార్స్ లేఖలకే పెద్ద పీట వేస్తుండటంతో ప్రాధాన్యతా వర్గాల ఉద్యోగులు, దివ్యాంగులు, భాగస్వామ్య మెరిట్ ఉద్యోగులకు బదిలీల్లో ప్రాముఖ్యత దక్కడం లేదన్నారు. ఈ నెల 5వ తేదీతో ముగియాల్సిన బదిలీల ప్రక్రియ కొన్ని శాఖల్లో ఇప్పటికీ బదిలీల జాబితాలు విడుదల చేయకపోవడం దేనికి సంకేతమో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

స్మార్ట్ బిల్లుతో గుల్ల

- స్మార్ట్ మీటర్లు వద్దంటున్న వినియోగదారులు
- స్మార్ట్ మీటరుతో రెట్టింపు బిల్లు
- వ్యాపారం చేయలేమంటున్న వ్యాపారులు



విద్యుత్ స్మార్ట్ మీటరు



బడ్డీకొట్టుల్లో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటరు

పాయకాపురం(విజయవాడ రూరల్): కూటమి ప్రభుత్వం వ్యాపార సంస్థలకు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లతో బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. గతంలో ఉన్న పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటును వ్యాపారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులు ప్రతి పక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పగుల గొట్టండని పిలుపు నిచ్చారు. ఇప్పుడు వారే ఏర్పాటు చేయించడంతో ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

ఇప్పటికి 1600 మీటర్లు..

పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 28 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో చిరువ్యాపారులు అనగా బడ్డీకొట్లలో టీ అమ్ముకొనేవారికి, మజ్జిగ, పాలు, పెరుగు విక్రయిస్తున్న వారికి, చిన్న హోటల్స్, మెడికల్ షాపులు, జ్యూస్ విక్రయదార్లకు, సుమారు 1600 మంది వినియోగదార్లకు విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు.

అధికంగా బిల్లులు..

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసిన నాటి నుంచి రెండు నెలల విద్యుత్ బిల్లులను వినియోగదార్లు చెల్లిస్తుంటే కళ్లవెంట నీళ్లు వస్తున్నాయని అంటున్నారు. విద్యుత్ బిల్లులు ఎందుకు అధికంగా వస్తున్నాయని ప్రశ్నిస్తుండగా కెపాసిటర్ సహకరించడం లేదని, దాన్ని ఏర్పాటు చేసుకోవాలని సిబ్బంది చెబుతున్నట్లు వినియోగదారులు అంటున్నారు.

చేసేదేం లేదంటున్నారు..

పైపులరోడ్డులో హోటల్ నడుపుతున్న సూర్యనారాయణ రాజు (సర్వీసు నంబరు 6425288233067)కు స్మార్ట్ మీటర్ పెట్టకముందు మార్చి నెలలో కరెంటు బిల్లు రూ.15,944 వచ్చింది. స్మార్ట్ మీటరు పెట్టిన తర్వాత మే నెలలో రూ.36,627, జూన్ నెల బిల్లు రూ.58,269 వచ్చింది. ఆ బిల్లులు తీసుకొని విద్యుత్‌శాఖ అధికారుల వద్దకు వెళ్లితే మీ కెపాసిటర్ స్మార్ట్ మీటరుకు సహకరించడం లేదని, మేము చేసేది ఏమీ లేదన్నారని వాపోయాడు. బిల్లు చెల్లించకపోతే ఫీజులు తీసే స్తామని చెప్పడంతో చేసేది లేక బిల్లు చెల్లించారు. రాజీవ్‌నగర్లో బడ్డీ కొట్లో విజయ డెయిరీ పాలు, మజ్జిగ అమ్ముతు న్నందుకు 20 రోజుల్లో రూ.3 వేల బిల్లు స్మార్ట్ మీటరు పెట్టిన తర్వాత వచ్చింది. రాజీవ్‌నగర్ సెంటర్లోని అన్ని బడ్డీకొట్లకు చివరకు సైకిల్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తికి కూడా స్మార్ట్ మీటరు ఏర్పాటు చేశారు. స్మార్ట్ మీటరు ఖరీదు రూ.17,500ను నెలనెలా వచ్చే కరెంటు బిల్లుతో వసూలు చేస్తున్నారని, నెలకు రూ.300 చొప్పున విధిస్తున్నట్లు వినియోగదార్లు చెబుతున్నారు. కూటమి నేతలు ప్రతి పక్షంలో ఉండగా విద్యుత్ స్మార్ట్ మీటర్లను నేలకేసి కొట్టండని పిలుపు నిచ్చారు. ఇప్పుడు నోరు మెదపడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

బిల్లు రెట్టింపు వస్తోంది..

స్మార్ట్ మీటరు పెట్టిన తర్వాత కరెంటు బిల్లు కట్టలేక పోతున్నా. పాత మీటరు ఉన్నప్పుడు వచ్చిన బిల్లుకంటే ఇప్పుడు రెట్టింపు బిల్లు వస్తోంది. దీంతో చేసేదిలేక అప్పులు చేసి కరెంటు బిల్లు చెల్లించాల్సి వస్తోంది. చిరు వ్యాపారులకు స్మార్ట్ మీటర్లు మోయలేని భారమవుతోంది. పునరాలోచన చేయాలి.

– చేకూరి వెంకట సూర్యనారాయణ, హోటల్ నిర్వాహకుడు

చర్యలు తీసుకోవాలి



స్మార్ట్ మీటరు ఏర్పాటు చేయకముందు నెలకు రూ.750 బిల్లు వచింది. స్మార్ట్ మీటరు పెట్టిన తర్వాత మే నెల బిల్లు రూ.1249, జూన్ నెల బిల్లు రూ.1313 వచ్చింది. కరెంటు బిల్లులు ఈ విధంగా వస్తుంటడంతో భయపడుతున్నాం. ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై తగిన చర్యలు తీసుకోవాలి.

– మన్నెం జగదీష్, కూరగాయాల వ్యాపారి, పైపులరోడ్డు

స్మార్ట్ మీటర్‌తో రీడింగ్ కరెక్ట్‌గా ఉంటుంది



స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయడం వలన విద్యుత్ వినియోగదార్లకు నెల రోజుల మీటర్ రీడింగ్ కరెక్ట్ గా ఉంటుంది. స్మార్ట్ మీటర్లో సిమ్ సిగ్నల్ ఉండటం వల్ల అది సాధ్యం అవుతోంది. సోలార్ విద్యుత్‌ను వినియోగదార్లు ఉపయోగించుకుంటే మంచి ఫలితాలను పొందవచ్చును. – రామ సుందర్, ఏఈ, పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్

దోమల నియంత్రణలో భాగస్వాములు కావాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దోమల నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని, వారంలో ఒకరోజు డ్రైడేగా పాటించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైఎస్ కమాలాకర్ కోరారు. 30వ డివిజన్ రామకృష్ణాపురంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటితోపాటు పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎక్కడైనా నీటి నిల్వలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే గంబూషియా చేపలు, మురుగునీటి నిల్వల్లో ఆయిల్‌బాల్స్ వేస్తామని తెలిపారు. అనంతరం డివిజన్‌లో దోమల నివారణ మందు స్ప్రే చేశారు. కార్యక్రమంలో శానిటరీ మేస్త్రి శ్రీను, వార్డు సచివాలయం సెక్రటరీలు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. 29వ డివిజన్ మధురానగర్‌లో శుక్రవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ జమలయ్య ఆధ్వర్యాన డ్రైడే ఫ్రైడే అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సలీం ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం పూలకుండీలు, పాత టైర్లు, రుబ్బు రోళ్ళు తదితర వాటిలో నిలిచిన నీటిని తొలిగించి లార్వాను నాశనం చేశారు.

చెత్తా చెదారం తరలించారు

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఎట్టకేలకు నగర పాలక సంస్థ పారిశుధ్య అధికారులు స్పందించారు. మధురానగర్ రైల్వేస్టేషన్ సమీపంలోని పేరుకుపోయిన చెత్త చెదారంను శుభ్రం చేశారు. పేరుకుపోయిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఇక్కడ చెత్త చెదారం పేరుకుపోతుందని పట్టించుకోవాల్సిన అధికారులు రైల్వే వారిదని వీఎంసీ వారు వీఎంసీదని రైల్వే సిబ్బంది చెత్తను శుభ్రం చేయటం లేదు. అలాగే పేరుకుపోయిన చెత్తను ఎప్పుడో ఒక సారి ఒక్కచోటకు చేర్చి తరలించకుండా నిప్పు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో స్థానికులు పడుతున్న అవస్థలు వివరిస్తూ సాక్షిలో ఇటీవల 'చెత్తకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు' శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ జమలయ్య రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తచెదారంను గత మూడు రోజులుగా శుభ్రం చేయించారు. బ్లీచింగ్ చల్లి పరిసరాలలో చెత్తవేయరాదంటూ స్థానికులకు సూచించారు.



రైల్వేస్టేషన్ రోడ్డులో శుభ్రం చేసి చెత్తను తరలిస్తున్న పారిశుధ్య సిబ్బంది

శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటిన కచేరి

విజయవాడ కల్చరల్: సామగాన లహరి కల్చరల్ ట్రస్ట్, కంచి కామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం సౌజన్యంతో సంగీత వాగ్గేయకారుడు మల్లాది సూరిబాబు 80 జన్మదిన వేడుకల సందర్భంగా లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శాస్త్రీయ సంగీత కచేరీలు సంగీత వైభవాన్ని చాటుతున్నాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో చెన్నయ్‌కి చెందిన యువ సంగీత కళాకారుడు ధూళిపాళ్ళ సాయి దీక్షిత్ రెండుగంటల పాటు వాగ్గేయకార కీర్తనలను అలవోకగా ఆలపించారు. శివనంద యశస్వి మృదంగంపై శ్రీరంజనీ వైష్ణవీ వాద్య సహకారం అందించారు. నిర్వాహకుడు మల్లాది సూరిబాబు మాట్లాడుతూ శనివారం నాటి కార్యక్రమాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు సాగుతాయన్నారు. దేవాలయ కార్యనిర్వాహకుడు డాక్టర్ రామ్మోనరావు పాల్గొన్నారు.



కీర్తనలు ఆలపిస్తున్న సాయి దీక్షిత్

జ్ఞాన జ్యోతిని వెలిగించేవాడే గురువు



వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: గురు సంప్రదాయాన్ని కాపాడు కోవాలని సంస్కారభారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ అన్నారు. గురుపూర్ణిమ సందర్భంగా సంస్కార భారతి మహానగర్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక సాంస్కృతిక కళా ప్రదర్శనలు, వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి గురు సత్కారం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన పీవీఎస్ కృష్ణ మాట్లాడుతూ సంస్కార భారతి సాంస్కృతిక, కళ, సాహిత్య రంగాలకు విశేషమైన సేవలను అందిస్తుందని చెప్పారు. సంస్కార భారతి నగర అధ్యక్షుడు పసుమర్తి భాస్కరశర్మ మాట్లాడుతూ జ్ఞాన జ్యోతిని వెలిగించేవాడు గురువన్నారు. విశ్వహిందూ పరిషత్ కోశాధ్యక్షుడు వి. దుర్గాప్రసాద్, విద్యావేత్త బోని సురేష్, వేదచారిటబుల్ సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యడ్లపాటి శేష సాయి. హైకోర్ట్ న్యాయవాది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సాయిశంకర్, శ్రావణ్‌కుమార్ నిర్వహించారు. సంస్కారభారతి నగర బాధ్యులు పాల్గొన్నారు. గురు పూజోత్సవం సందర్భంగా చిట్టా వెంకట ప్రసాద్ (నాటక రంగం), గండూరి శ్రీనివాసమూర్తి (సంగీతం), డాక్టర్ రామకృష్ణ (సాహిత్యం) డాక్టర్ చలికాండ ఉషామాధవి (నృత్యం), ఎస్.ప్రభాకర మల్లికార్జునరావును (చిత్రలేఖనం) సత్కరించారు. సంస్కార భారతి యువ కళాకారులు ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి కండ్రిక 11 కేవీ ఫీడర్ మరమ్మతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ పి. రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కండ్రిక, ఓల్డ్ పాయకాపురం, బర్మా కాలనీ, నూజివీడురోడ్, మణికంఠనగర్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ రైల్వే స్టేషన్ ఫీడర్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెహికల్ డిపో, పింగళ స్వామి స్ట్రీట్, లక్ష్మణ్ రావు స్ట్రీట్ , కౌతా సుబ్బ రావు వీధి, రైల్వే స్టేషన్, పూర్ణనందంపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ 11 కేవీ జీఎస్ రాజు ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్ రాజు రోడ్డు, కనకరాజు వీధి, కొమ్ముచారి వీధి, వానపాలవారి వీధి, పాపరాజు వీధి, పెనుమత్స వారి వీధి, దేవాలయం వీధి తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వైఎస్సార్ ఫీడర్ 11 కేవీ లైన్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో సింగ్‌నగర్‌లో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ పి.రవీంద్రబాబు, సింగ్‌నగర్ ఏఈ డి.కిరణ్‌కుమార్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్, లారీల బజార్, కృష్ణా హోటల్ సెంటర్, వాటర్ ట్యాంక్ రోడ్డు, యార్డ్‌రోడ్డు, స్మైల్‌హాస్పటల్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పేదలకు సక్రమంగా నిత్యావసరాలు పంపిణీ చేయాలి

ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి



రేషన్ షాపులో సరుకుల పంపిణీని తనిఖీ చేస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేదలకు నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలని ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి గంజిమాల సూచించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆమె విస్తృత తనిఖీలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూల్స్, రేషన్ దుకాణాలు, మండల స్థాయి స్టాక్ పాయింట్‌లను తనిఖీ చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు సరైన ఆహారం అందించాలన్నారు. నాణ్యత తప్పక పాటించాలన్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాల పంపిణీని పరిశీలించారు. వృద్ధులు, వికలాంగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీలర్లకు సూచించారు. ఆమె వెంట ఎన్టీఆర్ జిల్లా పౌరసరఫరాల అధికారి పాపారావు, ఏఎస్‌ఓలు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ రెడ్డి, లక్ష్మణబాబు, అసిస్టెంట్ కంట్రోలర్ కుమారి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రమేష్ బాబు తదితరులు ఉన్నారు.

కూటమి వైఫల్యంతోనే రైతు ఆత్మహత్యలు

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే రైతు ఆత్మహత్యలు జరుగుతున్నాయని.. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందజేయాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశానికి వెన్నెముక రైతు అని, అటువంటి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ధ్వజమెత్తారు. రైతులను పట్టించుకోకపోవడం వల్ల ఇటువంటి ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయం పండగలాగా చేసిందని చెప్పారు. రైతులకు మద్దతు ధర, సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించడమే కాకుండా బ్యాంకుల ద్వారా రుణాలు, పెట్టుబడి సాయం అందిస్తూ రైతన్నను ఆదుకుందని తెలిపారు. కౌలు రైతులను అన్ని విధాలా వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. కూటమి ప్రభుత్వంలో కౌలు రైతులను పట్టించుకోకపోవడం, సకాలంలో బ్యాంకు రుణాలు అందకపోవటం, క్రాప్ ఇన్సూరెన్స్ , గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యవసాయానికి పుట్టినిల్లు అని, అటువంటి రైతులకు వ్యవసాయంలో అపార నష్టం వాటిల్లితే తట్టుకోలేక పోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు పత్తి, మిరప పంటలకు గిట్టుబాటు ధర లేక ఉమ్మడి కృష్ణా జిల్లాలో పండిన పంటను రాష్ట్రంలో గిట్టుబాటు ధర లేక పండిన పంటను తెలంగాణలో అమ్ముకుంటున్నారన్నారు. కౌలు రైతులకు ఎటువంటి క్రాప్ ఇన్సూరెన్స్ లేకపోవడం వల్ల బకాయిలు కట్టలేక ప్రాణాలు విడుస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతులకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో క్షేత్రస్థాయిలో వెంటనే సమగ్ర సర్వే జరిపించి నష్టపరిహారం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీల హక్కుల సాధనకై ఈనెల 20న ఛలో ఢిల్లీ
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గోవిందరావు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధనకై ఈ నెల 20న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఛలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ సామాజిక వర్గాలకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈ నెల 21వ తేదీ నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీలపై జరుగుతున్న దాడుల నుంచి రక్షణకు బీసీ రక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. బీపీ మండల్ కమీషన్ సిఫార్సులు పూర్తి స్థాయిలో అమలు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీ రైతులకు 100 శాతం సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని, కేంద్ర బీసీ కమిషనులో ఖాళీగా ఉన్న సభ్యులను నియమించాలని తెలిపారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 20న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్లో ఆర్వో ప్లాంటు ప్రారంభం



ఆర్వో ప్లాంటు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

పాయకాపురం(విజయవాడరూరల్): పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో కోస్టల్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంటును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో సత్ఫలితాలను సాధించవచ్చన్నారు. విద్యార్థుల సౌలభ్యం కోసం వాటర్ ప్లాంటును ఏర్పాటు చేసిన కోస్టల్ బ్యాంక్ యాజమాన్యంను అభినందించారు. కోస్టల్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ టి.రామకృష్ణ మాట్లాడుతూ రూ.3.50 లక్షల వ్యయంతో వెయ్యి లీటర్ల సామర్థ్యం గల ఆర్వో ప్లాంటును బ్యాంక్ అందించామని చెప్పారు. ప్రముఖ న్యాయవాది, సామాజికవేత్త హజరయ్య గుప్తా మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక వేత్తలు, బ్యాంకులు ఇటువంటి సేవలను అందిండం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంటు మేనేజర్ శ్రీనివాసకుమార్, న్యాయవాది రాధా కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో ప్రపంచ జనాభా దినోత్సవం



పోటీలలో విజేతలతో నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎన్టీఆర్ జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచ జనాభా సమస్యల ప్రాముఖ్యతపై దృష్టిని కేంద్రీకరించడానికి ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించటం జరుగుతుందన్నారు. 2025 ప్రపంచ దినోత్సవం ఇతివృత్తం 'న్యాయమైన మరియు ఆశాజనకమైన ప్రపంచంలో యువతకు కావలసిన కుటుంబాన్ని సృష్టించడానికి వారిని శక్తివంతం చేయటం' అన్నారు. యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ లింగ సమానత్వం పేదరికం ఆరోగ్యం, మానవ హక్కులు వంటి జనాభా సమస్యలపై ప్రజలకు అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకోవడం చాలా అవసరమన్నారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వం , పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో విజేతలకు యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి చేతులమీదుగా బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు యుగంధర్ ,శర్వాణి, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ , ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

దోషులను వెంటనే అరెస్ట్ చేయాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్):కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువయిందని కాకినాడ జీజీహెచ్‌లో విద్యార్థులను బ్లాక్‌మెయిల్ చేసిన కీచకులను వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం త్రివేణి రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోజురోజుకు మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న బయోకెమిస్ట్రీ ల్యాబ్ అటెండెంట్ కళ్యాణ్ చక్రవర్తి ఆయనకు సహకరించిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్రంలో హోంమంత్రిగా ఒక మహిళ ఉన్నప్పటికీ మహిళలపై దాడులు జరగటం ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటని తెలిపారు. ఇంత జరుగుతున్నా మహిళ కమిషన్ ఇప్పటి వరకు స్పందించక పోవటం విచారకరం అన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ మహిళ కమిషన్ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

స్థాయీ సంఘం ఎన్నిక ఏకగ్రీవం

పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర పాలక సంస్థ స్థాయీ సంఘం సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమయింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షురాలిగా ఉండే ఈ సంఘానికి ఆరుగురు సభ్యుల ఎన్నికకు ఇటీవలే వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర నోటిఫికేషన్ విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ నుంచి 62వ డివిజన్ కార్పొరేటర్ అల్లం పూర్ విజయలక్ష్మి, ఒకటో డివిజన్ కార్పొరేటర్ ఉద్దంటి సునీత, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, 19వ డివిజన్ కార్పొరేటర్ రెహనా నాహిద్, 55వ డివిజన్ కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణ చంద్రరావు, 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా నామినేషన్ దాఖలు చేశారు. వీరిపై ఎవరూ పోటీ చేయకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. సభ్యులకు వీఎంసీ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్, జనరల్) డాక్టర్ డి. చంద్రశేఖర్ డిక్లరేషన్ పత్రాలు అందించారు.

అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి: వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో పాటు ఎన్ఎంఆర్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో శీనానాయక్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. బదిలీలలో ప్రధాన ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని, దర్శన టికెట్లు, ప్రసాదాల విక్రయ కౌంటర్లు, ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్లు, స్కానింగ్ తదితర పాయింట్లలోని సిబ్బందికి సైతం బదిలీలు జరిగాయి.